www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 29 డిసెంబర్ 2022



తిరుమల కొండపై విఆర్ఏ నిరసన



నిరసన తెలుపుతున్న వీఆర్ఏ శేఖర్

ప్రజాశక్తి -తిరుమల: తెలంగాణ రాష్ట్రంలో విధులు నిర్వహిస్తున్న 23వేల మంది వెంటనే పే స్కేల్ అమలు చేయాలని ఏపీలోని తిరుమల కొండపై ఓ వీఆర్ఏ ప్లకార్డుతో తెలిపిన నిరసన చర్చనీయాంశం మయ్యింది. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండల కేంద్రంలోని తహశీల్దార్ ఆఫీసులో విధులు నిర్వహిస్తున్న వీఆర్ఏ శేఖర్ బుధవారం తిరుమలలో నిరసన వ్యక్తం చేశాడు. మునుగోడు ఉప ఎన్నిక టైంలో కల్లబొల్లి మాటలు చెప్పి తమ దీక్షలు విరమింపజేసిన ప్రభుత్వం.. ఇప్పుడు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. అలిపిరి మెట్ల మార్గం ద్వారా ప్లకార్డు పట్టుకుని కొండ పైకి చేరు కున్నాడు. కేసీఆర్ మనసు కరిగేలా చేయాలని మొక్కులు చెల్లించుకున్నాడు. ఈ ఘటన విజిలెన్స్ అధికారులు గుర్తించకపోవడం ఆశ్చర్యానికి గురిచేసింది.

భూకబ్జాలకు దూరంగా ఉండండి..!

కార్పొరేటర్లకు 'ఎంఎల్ఏ' హితబోధ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

'మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్లు అంటే నాకు ఎంతో గౌరవం ఉంది.. అయితే మీ తీరు మార్చుకోవాలి... పార్టీకి నష్టం కలిగించే విధంగా వ్యవహరించొద్దు.. ఎన్నికల సమయం దగ్గర పడుతున్న సందర్భంగా ఎలాంటి వివాదాలు రాకుండా చూసుకోవాలి. భూకబ్జాలకు దూరంగా ఉండండి..' అని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్లకు హిత బోధ చేశారు. బుధవారం ప్రైవేట్ కళ్యాణమండపంలో కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, సచివాలయ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఇటీవల కాలంలోకార్పొరేటర్ల దందాలు ,ఆగడాలు మితిమీరి పోయాయంటూ పత్రికల్లో వరస కథనాలు వచ్చాయి. దీనికి తోడు 31వ డివిజన్ కార్పొరేటర్ రేవతి వైసిపి పార్టీకి చెందిన దుద్దెల బాబు మధ్య కోల్డ్ వార్ జరగడంతో దుద్దెల బాబు పార్టీకి రాజీనామా చేసినట్లు ప్రకటించారు. దీనికి తోడు దుద్దెల బాబుకు మద్దతుగా వైసిపి పార్టీకి చెందిన బొమ్మగుంట రవి 31వ డివిజన్ సచివాలయ అడ్మిన్ పై దౌర్జన్యానికి దిగడమే కాకుండా సోషల్ మీడియా వేదికగా అతనిపై ఇష్టం వచ్చినట్లు బూతులు తిట్టి సస్పెండ్ చేయించారు. ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి గత నాలుగు రోజులుగా నగరంలో లేరు. దీనికి తోడు ప్రతిపక్ష పార్టీలు ఆందోళన చేయడంతో వచ్చే ఎన్నికల్లో పార్టీపై ప్రభావం చూపే అవకాశం ఉందని భావించి 50 మంది కార్పొరేటర్లను సమావేశపరచి ప్రజలకు ఇబ్బంది కలగకుండా పాలన చేయాలని ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి సూచించారు. కార్పొరేటర్ల తీరు వల్ల వచ్చే ఎన్నికల్లో పార్టీకి చెడ్డ పేరు వచ్చే అవకాశం ఉందన్నారు. దీన్ని ఆసరాగా చేసుకుని ప్రతిపక్షాలు వాటికి వ్యతిరేకంగా విస్తృత ప్రచారం చేసే అవకాశం ఉందని సూచించారు. ఎన్నికల సమయంలో కార్పొరేటర్లు పార్టీ కోసం పని చేయాలని పేర్కొన్నారు. పార్టీకి నష్టం కలిగించే విధంగా వ్యవహరిస్తే వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటామని సున్నితంగా హెచ్చరించారు. 'భూ కబ్జాలకు దూరంగా ఉండండి.. నగరంలో భూకబ్జాలకు పాల్పడే విధంగా కార్పొరేటర్లు వ్యవహరించొద్దు.. కబ్జాలకు పాల్పడే వారిపై ఎటువంటి పరిస్థితిలో వదిలేది లేదు.. నవరత్నాల పథకాల గురించి విస్తృతంగా ప్రచారం చేయాలి' అని సూచించారు. పింఛన్లు ఎక్కడా రద్దు చేయడం లేదని, ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ప్రతి డివిజన్లో రెండు సచివాలయాలకి కలిపి సచివాలయ కన్వీనర్లను ఏర్పాటు చేశామని, వారు సక్రమంగా పని చేసే విధంగా చూడాలన్నారు. మాస్టర్ ప్లాన్ రోడ్లపై ప్రజల్లో చైతన్యం కల్పించి ట్రాఫిక్ నివారణ కోసం కార్పొరేటర్లు తమ వంతు కషి చేయాలని కోరారు. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ పని చేయాలని, పత్రికల్లో కార్పొరేటర్ల గురించి చెడ్డగా రాకుండా చూసుకోవాలని సూచించారు. ఏదేమైనా కార్పొరేటర్ల ఆగడాల వల్ల రాబోయే ఎన్నికల్లో ప్రభావం పడుతుందన్న ఉద్దేశంతో ఎమ్మెల్యే కార్పొరేటర్లకు హితబోధ చేసినట్లు తెలుస్తోంది.

సిఐటియు రాష్ట్ర మహాసభల్లో...

టిటిడి అటవీ కార్మికులది ప్రత్యేక అజెండా

చైతన్య ప్రచార యాత్రకు ఘన స్వాగతం



కుప్పంలో యాత్రను ప్రారంభిస్తూ...

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

జనవరి 2, 3, 4 తేదీల్లో భీమవరంలో జరిగే సిఐటియు రాష్ట్ర మహాసభల్లో టిటిడి అటవీ కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపైన ప్రత్యేక అజెండా ఉంటుందని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.అజయ్‌కుమార్ వెల్లడించారు. రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, అసంఘటిత రంగ కార్మికుల సమస్యలపై ప్రధానంగా చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. కుప్పంలో బుధవారం ప్రారంభమైన సిఐటియు రాష్ట్ర చైతన్య ప్రచార జాత పలమనేరు, చిత్తూరు మీదుగా సాయంత్రానికి తిరుపతి చేరుకుంది. ఫారెస్టు కార్మికుల రిలేదీక్షా శిబిరం వద్ద కార్మికులు జాతాకు పెద్దఎత్తున స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ టిటిడి ఫారెస్టు కార్మికులు రెండేళ్లకు పైగా చేస్తున్న ఈ పోరాటం రాష్ట్ర కార్మిక ఉద్యమానికి స్ఫూర్తిదాయకంగా నిలిచిందన్నారు. టిటిడిలో ఫారెస్టు, కాంట్రాక్టు కార్మికులే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వివిధ కార్మికులకు సంబంధించి సమస్యలపై ప్రభుత్వం వెంటనే పరిష్కరించే దిశగా భవిష్యత్ ఉద్యమాలు ఉంటాయన్నారు. మధ్యాహ్న భోజన కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయా రమాదేవి మాట్లాడుతూ కష్టపడి సంపద సృష్టించిన కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని, కనీస వేతనం 26వేలు ఇవ్వాలని సిఐటియు డిమాండ్ చేస్తోందన్నారు. కార్మికులు గొంతెమ్మ కోర్కెలు కోరలేదని, సమానపనికి సమాన వేతనం కోరుతున్నారని చెప్పారు. న్యాయమైన కోర్కెలు పరిష్కరించే ఓపిక ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి లేదన్నారు. ఉద్యమాల ద్వారా వత్తిడి తెచ్చి హక్కులను సాధించుకోవాలన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను 29 హక్కులను రద్దు చేసి లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందన్నారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కటారి అజయ్‌కుమార్ మాట్లాడుతూ 30 ఏళ్లుగా పనిచేస్తున్న టిటిడి కార్మికులు తమకు టైంస్కేల్ ఇవ్వాలని రెండేళ్లుగా ఆందోళన చేస్తున్నా అటు రాష్ట్ర ప్రభుత్వానికి, ఇటు టిటిడి అధికార యంత్రాంగానికి బుద్ధి లేదన్నారు.



టిటిడి అటవీ కార్మికులను ఉద్దేశంచి ప్రసంగిస్తూ..

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ భీమవరంలో జరిగే రాష్ట్ర మహాసభలకు సిఐటియు అఖిల భారత అధ్యక్ష కార్యదర్శులు తపన్‌సేన్, హేమలత, రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్ నర్సింగరావు, గఫూర్‌లతో పాటు కేరళ కార్మిక మంత్రి హాజరై రాష్ట్రంలో అధికారం రాకముందు జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలపై పెద్దఎత్తున నిలదీస్తారన్నారు. టిటిడి అటవీ కార్మికులు చేస్తున్న ఉద్యమం దేశవ్యాప్తంగా చర్చనీయాంశం అయ్యేలా ఆరోజు బహిరంగసభలో ఉంటుందన్నారు. ఓ సంస్థలో 180 రోజులు పనిచేస్తే పర్మినెంట్ చేయాలని, టిటిడి అటవీ కార్మికులు 30 ఏళ్లుగా పనిచేస్తున్నారని, పాలకమండలి తీర్మానాన్ని అమలు చేయాలని 780 రోజులుగా రిలేదీక్షలు చేస్తున్నా సిగ్గులేకుండా రాష్ట్ర ప్రభుత్వం, టిటిడి అధికార యంత్రాంగం వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. ఏ కష్టమొచ్చినా శ్రీవారికి చెప్పుకునేందుకు భక్తులు వస్తారని, దేవుని సన్నిధిలో పనిచేస్తున్న టిటిడి అటవీ కార్మికులకు కష్టం వస్తే ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాలేదన్నారు. టిటిడి ఫారెస్టు కార్మికుల సంఘం నాయకులు సురేష్ తాము చేస్తున్న ఆందోళన పట్ల రాష్ట్ర ప్రభుత్వం, టిటిడి యాజమాన్యం ఏవిధంగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందో వివరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు అధ్యక్షులు జిబిఎస్ మణ్యం, చిత్తూరు సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.చైతన్య, సురేంద్రన్, తిరుపతి జిల్లా సిఐటియు నాయకులు ఎంఎన్ ప్రసాద్‌రావు, టి.సుబ్రమణ్యం, వేణు, బాలాజీ, బుజ్జమ్మ, ఆర్.లక్ష్మి, మాధవ్‌కృష్ణ, జయంతి, రఘు, జెవికెఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగన్మోహన్‌రావు, ఫారెస్టు నాయకులు మల్లికార్జున, పురుషోత్తం, ఈశ్వర్‌రెడ్డి, మునికృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జాతా అన్నమయ్య జిల్లా పీలేరుకు బయల్దేరి వెళ్లింది.

కార్మిక చైతన్య యాత్ర డిమాండ్లు

- లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలి.
- కార్మికులందరికీ కనీస వేతనం నెలకు 26వేలు అమలు చేయాలి.
- కార్మికులందరికీ బోనస్, పిఎఫ్, ఈఎస్ఐ గ్రాట్యూటీ చెల్లించాలి.
- స్కీమ్ వర్కర్స్ ను కార్మికులుగా గుర్తించాలి. సంక్షేమ పథకాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్రాట్యూటీని అమలు చేయాలి.
- భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం బోర్డు కార్యకలాపాలు పునరుద్ధరించాలి.
- హమాలి, ఆటో, ప్రైవేట్, ట్రాన్స్పోర్ట్ కార్మికుల సమగ్ర చట్టం చేయాలి.
- కాంట్రాక్ట్, అవుట్సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలి
- విశాఖ స్టీల్ తో సహా కోర్టులు, రైలు, విద్యుత్ రంగాలను అమ్మటాన్ని అడ్డుకుందాం.
- మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడదాం.
- నిత్యవసర వస్తువులు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను అరికట్టాలి.

అమ్మవారిని దర్శించుకున్న సుప్రీం ప్రధాన న్యాయమూర్తి



ప్రజాశక్తి - తిరుచానూరు: భారత సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి వై చంద్ర చూడ్ బుధవారం సాయంత్రం కుటుంబ సమేతంగా తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని దర్శించు కున్నారు. ఆలయం ఎదుట టీటీడీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి, ఈవో అనిల్ కుమార్ సింఘాల్ స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు పూర్ణ కుంభంతో సాంప్రదాయ బద్ధంగా స్వాగతించారు. ధ్వజస్తంభానికి మొక్కుకున్న అనంతరం జస్టిస్ చంద్ర చూడ్ దంపతులు శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు అమ్మవారి శేషవస్త్రంతో సన్మానించి వేద ఆశీర్వాదం చేశారు . అనంతరం ఆశీర్వాద మండపంలో సిజెఐకి చైర్మన్, ఈవో అమ్మవారి ప్రసాదాలు అందజేసి వస్త్రంతో సన్మానించారు. జిల్లా జడ్జి వీర్రాజు , టీటీడీ సివిఎస్వో నరసింహ కిషోర్, డిప్యూటీ ఈవో శాంతి , విజివో మనోహర్, అదనపు ఎస్పీ కులశేఖర్, డిఎస్పీ మురళీ కష్ణ, ఆలయ ఏఈవో ప్రభాకర్ రెడ్డి, ఆగమ సలహాదారు శ్రీనివాసాచార్యులు, అర్చకులు బాబు స్వామి పాల్గొన్నారు.

బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి కట్టుబడిన సిఎం : మంత్రి



ప్రజాశక్తి-క్యాంపస్ : రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాలకు రాజ్యాంగంలో కల్పించిన వాటా కంటే ఎక్కువగానే సంక్షేమ పథకాలను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి అవినీతికి తావు లేకుండా అందజేస్తున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున పేర్కొన్నారు. బుధవారం మధ్యాహ్నం తిరుపతి శ్రీపద్మావతి అతిథి గృహంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులైన పేదలందరికీ ఎలాంటి రెకమండేషన్ లేకుండా, కుల, మత, పార్టీలకు అతీతంగా పారదర్శకంగా ఎస్సి ఎస్టీ బిసి మైనార్టీ వర్గాలకు రాజ్యాంగంలో కల్పించిన వాటాకంటే ఎక్కువగా సంక్షేమ పథకాలు అమలు పరిచి అవినీతికి ఎక్కడ తావు లేకుండా పారదర్శకంగా ఆమలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి దళితుల అభివద్ధికి అధిక ప్రాధాన్యతనిస్తు న్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన కమీషన్ సభ్యులు వడిత్య శంకర నాయక్, సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి చెన్నయ్య పాల్గొన్నారు.

జిల్లాలో ప్రముఖుల పర్యటన

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తమిళనాడు గవర్నర్ తిరు ఆర్.ఎన్ రవి గురువారం మధ్యాహ్నం 3:30 గం. లకు చెన్నై రాజ్ భవన్ నుండి రోడ్డు మార్గాన బయలుదేరి సాయంత్రం 6:30 గంటలకు శ్రీ పద్మావతి అతిథి గహం తిరుమలకు చేరుకుని రాత్రి బస చేసి మరుసటి దినం 30న ఉదయం శ్రీవారిని దర్శించుకుని ఉదయం 10:30 కు తిరుగు పయనం కానున్నారని కలెక్టర్ కె. వెంకట రమణ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర విద్యుత్తు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి కష్ణ పాల్ గుర్జార్ గురువారం ఉదయం 9:45కు న్యూఢిల్లీ విమానాశ్రయం నుండి బయలుదేరి మధ్యాహ్నం 1.55 గంటలకు తిరుపతి ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్ చేరుకుని అక్కడ నుండి రోడ్డు మార్గాన బయలుదేరి మధ్యాహ్నం 2:30 గంటలకు తిరుమల చేరుకుని శ్రీ వారి దర్శనం చేసుకుని అక్కడే రాత్రి బస చేసి మరుసటి దినం తేదీ 30న ఉదయం శ్రీవారిని మరొకసారి దర్శించుకుని రాత్రి బస చేసి 31న తిరుమల నుండి బయలుదేరి మధ్యాహ్నం 2:30 గంటలకు తిరుపతి న్యూఢిల్లీకి తిరుగు పయనం కానున్నారు. కేంద్ర ట్రైఫెడ్ చైర్మన్, భారత గిరిజన మంత్రిత్వ శాఖ రామ్ సింహ్ రత్వా ఈనెల 30వ తేదీన విశాఖపట్నం నుండి సాయంత్రం 5.30 గంటలకు బయలుదేరి చెన్నై మీదుగా రాత్రి 10:30 గంటలకు తిరుమల చేరుకుని రాత్రి బస చేసి మరుసటి దినం 31న శనివారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుని మధ్యాహ్నం 12:30 గంటలకు తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయం నుండి తిరుగు పయనం కానున్నారని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

ఫెన్సింగ్ కోచింగ్ సెంటర్‌ను పరిశీలించిన బషీర్ ఖాన్



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: శ్రీదేవి కాంప్లెక్స్‌లో వున్న ఫెన్సింగ్ కోచింగ్ సెంటర్‌ను ఫెన్సింగ్ అసోసియేషన్ కోశాధికారి బషీర్ అహ్మద్ ఖాన్ సందర్శించారు. నగరానికి విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ఫెన్సింగ్ క్రీడకు ఒలింపిక్స్, ఏషియన్ గేమ్స్, నేషనల్ గేమ్స్ లలో అత్యధిక మెడల్స్ వున్నాయని,ఆధ్యాత్మిక నగరమైన తిరుపతి లో ఎంతోమంది ప్రతిభావంతులైన క్రీడాకారులు వున్నారని, సాక్షాత్తు శ్రీ వేంకటేశ్వర స్వామి వారే ఖడ్గ చాలనంలో గొప్ప ప్రదర్శన చేసేవారని వారి ఖడ్గానికి నందకమని పేరు వున్నదని ఇక్కడకు వచ్చిన తరువాత తెలిసిందని, ఇష్టపడి సాధన చేస్తే కష్టం అనిపించదని అన్నారు. క్రీడాకారులకు మంచి శిక్షణ ఇప్పిస్తామన్నారు. నిర్వాహకురాలు పి.గీతను, రాష్ట్ర ఫెన్సింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు నాగం సతీష్‌బాబును అభినందించారు.

రాజీవ్ నగర్‌లో మౌలిక వసతులు కల్పించండి



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పట్టణ శివారు ప్రాంతమైన రాజీవ్ నగర్‌లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేయాలని రాజీవ్ నగర్ అభివృద్ధి సాధన కమిటీ డిమాండ్ చేసింది. రాజీవ్ నగర్ వద్ద ఆ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు అంగేరి పుల్లయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ 22 ఏళ్ల క్రితం రాజీవ్ నగర్ ఏర్పడిందన్నారు. సుమారు 5 వేలకు పైగా నిరుపేద కుటుంబాల వారు ఇక్కడ స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారని చెప్పారు. అయితే ప్రభుత్వాలు మారుతున్నా కానీ రాజీవ్ నగర్ తలరాత మాత్రం మారడం లేదని వాపోయారు. ఇన్నేళ్ళు గడుస్తున్నా కనీసం ఇక్కడ బడీ, గుడీ, అంగన్వాడీ కేంద్రం, ప్రాథమిక వైద్య కేంద్రం, ఓ కమ్యూనిటీ హాలును ఏర్పాటు చేయకపోవడం అత్యంత బాధాకరమన్నారు. రోడ్లు, డ్రెయిన్లు, వీధి లైట్లు, సరైన తాగునీటి వసతి లేక రాజీవ్ నగర్ కాలనీవాసులు పడరాని పాట్లు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణానికి కూతవేటు దూరంలోనే రాజీవ్ నగర్ ఉన్నా కన్నెత్తి చూసే నాధుడే కరువయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుత వైసిపి ప్రభుత్వం ఏర్పడి నాలుగో ఏడాదికిలోకి అడుగుపెడుతున్నా రాజీవ్ నగర్ సమస్యలు ఏమాత్రం పట్టించు కోలేదని ధ్వజమెత్తారు. శ్రీకాళహస్తి-పిచ్చాటూరు రోడ్డు నుంచి రాజీవ్ నగర్ ఓవర్ హెడ్ ట్యాంక్ వరకు పేరుకు మాత్రమే 100 అడుగుల రోడ్డు వేశారనీ, కానీ దాని బాగోగులు మాత్రం మరిచారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే సీసీ రోడ్డు వేయించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రాజీవ్ నగర్‌లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం సత్వరమే చర్యలు తీసుకోకుంటే దశల వారీగా ఆందోళనలు చెప్పడతామని హెచ్చరించారు. అనంతరం మున్సిపల్ అధికారికి వినతిపత్రం అందజేశారు. రాజీవ్ నగర్ అభివృద్ధి సాధన కమిటీ సభ్యులు గెడి వేణు, సురేష్, మారయ్య, కుప్పమ్మ, నిర్మల, కృష్ణయ్య, దాము, మునిరాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనుమానంతో హతమార్చారు

వీడిన భూత వైద్యుడి హత్యా చిక్కుముడి

మీడియా ముందుకు నిందితులు





ప్రజాశక్తి- తొట్టంబేడు: ఈనెల 21వ తారీఖున శ్రీకాళహస్తి పట్టణంలోని ఉపాధ్యాయ నగర్ లో ఉంటున్న భూత వైద్యుడు చంద్రయ్య హత్యకు గురైన విషయం విధితమే అయితే ఆ హత్య కేసును టూటౌన్ పోలీసులు భూతవైద్యుడు హత్య చిక్కుముడి విప్పారు. బుధవారం హత్య చేసిన నిందితులను పట్టుకుని మీడియా ముందు నిలబెట్టారు. శ్రీకాళహస్తి డీఎస్పీ విశ్వనాథ్ కథనం మేరకు వివరాలు ఎలా... ఆయన మాట్లాడుతూ తిరుపతి ఎస్పీ పరమేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు టూటౌన్ సిఐ భాస్కర్ నాయక్, బుచ్చినాయుడు కండ్రిగ సిఐ విక్రమ్ రెండు టీములుగా ఏర్పడి నిందితులను పట్టుకున్నారన్నారు. తొట్టంబేడు మండలం పెద్ద కనపర్తి గ్రామానికి చెందిన హరికృష్ణ, శ్రీకాళహస్తి పట్టణంలోని ముత్తరాశిపాలెంకు చెందిన సురేష్ లు వారి కుటుంబ పరిస్థితి సరి లేనందునవారింట్లో కొంతమందికి అనారోగ్యంగా ఉండడంతో భూత వైద్యుడైన చంద్రయ్య వద్దకు వెళ్లి డబ్బులు ఇచ్చి పూజ చేయించారు. అయితే మొదటిలో వారికి నయమైంది. మరలా వారికి అనారోగ్యం రావడం తో చంద్రయ్య దగ్గరకు వెళ్లారు అయితే ఆయన ఎక్కువ డబ్బులు అడగడంతో వాళ్లు ఆయన దగ్గరకు వెళ్లడం మానేశారు. అప్పటినుంచి చంద్రయ్య వాళ్ళకు ఫోన్ చేసి ఎక్కువ డబ్బులు ఇస్తే మీకు నయం చేస్తానని లేకపోతే మిమ్మల్ని చంపేస్తానని బెదిరించాడు అయినవారు చంద్రయ్య దగ్గరకు వెళ్లలేదు కొద్దిరోజుల తర్వాత హరికృష్ణ, సురేష్ కుటుంబీకుల ఇంటిలో వాళ్లకి యాక్సిడెంట్ అవ్వడం, హరికృష్ణ అమ్మకు మతి స్థిమిత లేకపోవడం ఇలాంటి సంఘటనలు జరగడంతో చంద్రయ్య చేతబడి చేసి ఉంటాడని అనుమానంతో అతను చంపాలని హరికృష్ణ వాళ్ల ఫ్రెండ్స్ కి రెండు లక్షలు సుపారి ఇస్తానని వారితో కలిసి పథకం ప్రకారం చంద్రయన హత మార్చారు.వయసు 24 ఇతను ఫారెస్ట్ డిపార్ట్మెంట్లో ఔట్సోర్సింగ్ వాచర్,సురేష్ వయసు 29 శ్రీకాళహస్తి ఫారెస్ట్ డిపార్ట్మెంట్లో ఔట్సోర్సింగ్ వాచర్ లు కలిసి వారి స్నేహితులైన సూళ్లూరుపేట మండలం మన్నారు పోలూరు గ్రామానికి చెందిన శ్రీనివాసులు వయసు 20 కళ్యాణి వాటర్ ప్లాంట్ లో కూలి అదే గ్రామానికి చెందిన గుణశేఖర్ వయసు 27 బేల్దారి మేస్త్రి బుచ్చినాయుడు కండ్రిక మండలం నెలవాయి గ్రామానికి చెందిన శశి కుమార్ వయసు 25 ఆటో డ్రైవర్ అదే గ్రామానికి చెందిన మల్లికార్జున వయసు 48 విత్తనం శ్రీ సిటీలో ప్రైవేట్ సెక్యూరిటీ, వీళ్ళందరూ కలిసి చంద్రయ్యను రెండు ఇనుప కత్తిలతో రెండు కోడి కత్తులతో గొంతు కోసి చంపారన్నారు. నిందితుల దగ్గర నుండి 5 సెల్ ఫోన్లు 2000 రూపాయలు రెండు బైకులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును సేదించిన టూ టౌన్ సీఐ భాస్కర్ నాయక్, బుచ్చినాయుడు సిఐ విక్రమ్, ఎస్సై మహేష్ బాబు, మంజునాథ్ రెడ్డి, రాఘవేంద్ర ఎఎస్ఐ యువరాజు నాయుడు, హెడ్ కానిస్టేబుల్ సురేష్, కానిస్టేబుల్స్ నందకుమార్, కిషోర్, శ్రీనివాస్, నాగ భూషణం, బాబు, మహేష్‌లను తిరుపతి ఎస్పీ రివార్డులతో అభినందించాలన్నారు.

రాక్ ఫైటర్స్ తైక్వాండో పోటీలలో..

'ఆక్స్‌ఫర్డ్' విద్యార్థుల ప్రతిభ



ప్రజాశక్తి-రేణిగుంట: తిరుపతిలోని శిల్పా రామంలో జరిగిన రాక్ ఫైటర్స్ తైక్వాండో క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం కరాటే పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో సుమారు 30 పాఠశాల నుండి 320 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ రమేష్ బాబు, అసిస్టెంట్ ప్రొఫెసర్ అలాగే రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ లక్ష్మీపతి పాల్గొన్నారు. అందులో భాగంగా రేణిగుంట పాంచాలి నగర్‌లోని ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు అక్మల్‌అ, జీమ్, గోకుల్, దీపక్‌లకు బంగారు పథకాలు అలాగే మిగతా విద్యార్థులకు వెండి రజత పథకాలు బహుమతిగా ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆక్స్‌ఫర్డ్ స్కూల్ కరాటే మాస్టర్ అవినాష్ ఆర్గనైజింగ్ కమిటీ మెంబర్లు మురళి, కేశవులు, రవి, చలపతి, విద్యార్థులు పాల్గొన్నారు.

అంకితభావంతో సాధన చేస్తే విజయం తథ్యం



ప్రజాశక్తి -తిరుపతి టౌన్: విద్యార్థులు అంకితభావంతో సాధన చేస్తే విజయం తథ్యమని ప్రొఫెసర్ ఎ.సుధాకర్ అన్నారు. ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా బుధవారం పట్టణంలోని ఎటిఎన్ జూనియర్, డిగ్రీ కళాశాలలో 'పోటీ పరీక్షల్లో విజయం సాధించడం ఎలా?' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎ.సుధాకర్ మాట్లాడుతూ పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే విద్యార్థులకు ప్రతిభ ఒకటే కొలమానం కాదని, దానిని ఒక క్రమ పద్ధతిలో పదును పెట్టే వారికి విజయం సాధ్యమవుతుందని తెలిపారు. తన మీద తనకు నమ్మకం లేకపోయినా, అంకిత భావంతో కషి చేయకపోయినా, అతి విశ్వాసం వున్నా పోటీ పరీక్షలలో విజయం సాధ్యం కాదన్నారు. తప్పనిసరిగా ప్రతి విద్యార్థీ తన లక్ష్యానికి అనుగుణంగా ప్రణాళిక ప్రకారం ముందుకు సాగాలని, సమాజాభివద్ధికి అవసరమైన క్రమశిక్షణ, నైతిక విలువలు పై ప్రతి విద్యాసంస్థలోను అవగాహన కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులను మంచి మార్గంలో నడిపించాల్సిన బాధ్యత యాజమాన్యాలు, విద్యార్థి సంఘాలు, సామాజిక సంఘాలపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రవి, కార్యదర్శి మాధవ్, నాయకులు ఉరుకుంద, హరిత, శివ, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మఒడితో విద్యార్థులకు ఆర్థిక భరోసా

మంత్రి ఆర్.కె.రోజా



ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన ట్యాబులను విద్యార్థులకు పంపిణీ చేస్తున్న మంత్రి ఆర్కే రోజా

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: సీఎం జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలోని ప్రభుత్వ బడులను బలోపేతం చేస్తూ అమ్మఒడి పథకంతో విద్యార్థులకు ఆర్థిక భరోసా ఇస్తున్నారని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక వ్యవహారాల, యువజన సర్వీసులు క్రీడా శాఖ మంత్రి ఆర్.కె.రోజా తెలిపారు. బుధవారం పుత్తూరులోని జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌లో ఎనిమిదవ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దక్షిణాది రాష్ట్రాలలో ఏ సీఎం చేయని విధంగా రాష్ట్ర ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలను అందిస్తున్న రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ పేరుగాంచిందన్నారు. నేటి బాలలే రేపటి పౌరులు గనుక ఎంతో దూరదృష్టితో మన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధిక భాగం విద్య కోసం నిధులను ఖర్చు చేస్తున్నారన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు ఆ దిశగా అడుగులు వేయాలని, బైజూస్ సంస్థ కంటెంట్‌తో నూతన టెక్నాలజీతో రూపొందించిన ట్యాబ్‌లను ఎనిమిదో తరగతి విద్యార్థులకు అందించడం జరుగుతోందన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి వి.శేఖర్, ఉప విద్యాశాఖాధికారి రఘురామయ్య, మునిసిపల్ చైర్మన్, ఏ.హరి. వైస్ చైర్మన్‌లు డి.శంకర్, డి.జయప్రకాష్, ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, కౌన్సిల్లర్లు, వనిత కార్తీక్, ఎంపిటీసీలు, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, రాష్ట్ర డైరెక్టర్లు, కమిటీల చైర్మన్లు, మనోహర్ రెడ్డి, ఎంపీడీఓ, ఇందిరమ్మ. మున్సిపల్ కమిషనర్ కేఎల్ ఎంఎన్ రెడ్డి, మండల విద్యాశాఖధికారి, తిరుమల రాజు, ప్రిన్సిపాల్, రఘుపతి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు, తల్లితండ్రులు, విద్యార్థులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి బోరు ఏర్పాటు చేయండి

మంత్రి ఆర్.కె.రోజాకు వినతి



ప్రజాశక్తి - పుత్తూరుటౌన్: వడమాలపేట మండలంలోని ఎస్‌బిఆర్‌పురం పంచాయతీకి చెందిన ఎస్సీ కాలనీకి తాగునీటి బోరు ఏర్పాటు చేయాలని మంత్రి ఆర్కే రోజాకు బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ భారీ వర్షాల వల్ల గూళూరు చెరువు నిండిపోయింది. దీనివల్ల నీళ్ళు కలుషితమై పోవడంతో అందులోని శ్మశానం కూడా ఉండడంవల్ల తాగునీటికి ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన మంత్రిరోజా తాగునీటి బోరు మంజూరు చేసామని వారంలోపల బోర్ వేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దళిత గిరిజన సంఘ జిల్లా కార్యదర్శి వై.నందయ్య, మహిళలు రమణమ్మ, శారద, నాగమ్మ, అరుణ, చెంచమ్మ, ఎన్.జయరామయ్య తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి పార్లమెంట్ వక్ఫ్‌బోర్డ్

డైరెక్టర్‌గా అహమద్ అలీ నియామకం

ప్రజాశక్తి - పుత్తూరుటౌన్ : వైఎస్‌ఆర్ తిరుపతి పార్లమెంటరీ వక్ఫ్‌బోర్డ్ డైరెక్టర్‌గా పుత్తూరు పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీకి చెందిన అహమద్ అలీ మంత్రి శాసన సభ్యులు ఆర్.కె.రోజా చేతుల మీదుగా తిరుపతి పార్లమెంట్ వక్ఫ్‌బోర్డ్ డైరెక్టర్ నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా అహమద్ అలీ మాట్లాడుతూ తనకు పదవి రావడానికి కృషి చేసిన మంత్రి ఆర్.కె.రోజాకి కృతజ్ఞతలు తెలుపుతూ మైనారిటీల వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ కోసం అహర్నిశలు కష్టపడి పనిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ షేక్ సిరాజ్ బాషా, చాను, జమీర్, సర్దార్, హాషీం, ఇలాక్ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ పెన్షనర్ల దినోత్సవ వేడుకలు



ప్రజాశక్తి - పుత్తూరుటౌన్: పట్టణంలోని స్థానిక కార్వేటినగర్ రోడ్డులో గల పెన్షనర్ల భవనంలో పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్ రాజు అధ్యక్షతన బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షనర్ల బకాయిలు, సేవా కార్యక్రమాలు ఎందరికో స్ఫూర్తిదాయకం అన్నారు. ముఖ్యఅతిథిగా చిత్తూరు జిల్లా ఖజానా అధికారి ఎల్లీశ్వర్ రెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగులకు ఎదురయ్యే సమస్యలు అన్నింటిని పరిష్కరిస్తామని అన్నారు. అనంతరం ఆర్‌ఆర్ ప్రతాప్‌సింగ్ భక్తి గీతాలను ఆలపించారు. 75 సంవత్సరాలు నిండిన సందర్భంగా 20 మందికి పైగా రిటైర్డ్ ఉద్యోగులను సన్మానించారు. వృద్ధులకు చీరలు వితరణ చేశారు. కీర్తి శేషులు శ్రీనివాసులు, పద్మావతంకే శ్రద్ధాంజలి ఘటించారు. దొరస్వామి రాజు, కె.వి రామచంద్రయ్య, రామమూర్తి భోజన వితరణ చేశారు. గుణశేఖర్ రెడ్డి, భాస్కర్ రాజు, కుప్పయ్య, చంద్ర శేఖర్ వర్మ, చంద్ర శేఖర్ రెడ్డి, నారాయణ రెడ్డి, కృపావరమ్మ, రవిశంకర్, రామచంద్ర రాజు, శంకరయ్య, రామలింగం, వెంకటకృష్ణ, మేకల సుబ్రమణ్యం, వేలు, చిరంజీవి, వర్మ, బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

భూ సర్వేకి సహకరించండి

సర్పంచులు, ఎంపిటిసిలను కోరిన తహశీల్దార్

ప్రజాశక్తి -దొరవారిసత్రం : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ సర్వే కార్యక్రమానికి సర్పంచ్‌లు, ఎంపిటిసిలు సహకారం అందించాలని స్థానిక తహశీల్దార్ గోపిరెడ్డి కోరారు. బుధవారం మండల కార్యాలయంలో తహశీల్దార్, గోపిరెడ్డి ఎంపిడిఓ సింగయ్య అధ్యక్షతన సర్పంచ్‌ల, ఎంపిటిసిల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ కొంత మంది రైతులకు కేవలం అగ్రిమెంట్లు మాత్రమే ఉన్నాయని.. మరి కొందరికి సంవత్సరాల తరబడి సబ్ డివిజన్ కాలేదని ఇలాంటి వారందరికీ ఇది చాలా మంచి అవకాశమని తెలిపారు. సర్పంచులు ప్రధాన పాత్ర పోషించాలని ఆయన అన్నారు. ముఖ్యంగా కొన్నిగ్రామాల్లో శ్మశాన వాటికలు లేక ఇబ్బందులు పడుతున్నారని మరి కొన్ని గ్రామాల్లో శ్మశానాలకు రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని అలాంటి గ్రామాలకు వెంటనే శ్మశాన స్థలాలు కేటాయించడం జరుగుతుందని ఆయన తెలిపారు. యేకొల్లు పంచాయతీకి శ్మశాన స్థలం మంజూరు చేయవలసిందిగా స్థానిక సర్పంచి ఆవుల బ్లస్సీ కోరగా వెంటనే మంజూరు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

రాష్ట్ర మీడియా కో-ఆర్డినేటర్ తల్లికి నివాళి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని పుత్తూరు మున్సిపాలిటీ గేట్ పుత్తూరుకు చెందిన రాష్ట్ర తెలుగు యువత మీడియా కో-ఆర్డినేటర్ డి.జి.ధనపాల్ తల్లి డి.జి.కృష్ణ వేణి మృతికి నగరి నియోజక వర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి గాలి భాను ప్రకాష్ ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. వీరితో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు, పుత్తూరు పట్టణ ప్రధాన కార్యదర్శి ఎన్.ఎన్.ధనపాల్, టిఎన్‌టియుసి చిత్తూరు పార్లమెంటరీ అధ్యక్షులు రావిళ్ళ మాధవ నాయుడు, పల్లిపట్టు మోహన్, మణి రెడ్డి, హమీద్ భాషా పాల్గొన్నారు..

13వ జాతీయ డ్యాన్స్ స్పోర్ట్ ఛాంపియన్షిప్ 2022 పోటీల్లో రాష్ట్ర స్పోర్ట్స్ టూరిజం శాఖ మంత్రి ఆర్. కే. రోజా గారితో విశ్వం విద్యా సంస్థల అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వ చందన్ రెడ్డి కరస్పాండెంట్ ఎన్.తులసి విశ్వనాథ్ ...



గ్రామాల్లో పడకేసిన పారిశుధ్యం

- ●రోగాలబారిన గ్రామస్తులు
- ●పట్టించుకోని సచివాలయ సిబ్బంది



ప్రజాశక్తి -దక్కిలి

మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్యం పడకేసిందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని మేజర్ పంచాయతీ మోపూరు గ్రామ సచివాలయానికి సంబంధించి దందోలు, మోపుర్ఎల్లంపల్లి, మోపుర్ క్రాస్ రోడ్ ప్రాంతంలో ఎటువంటి పారిశుధ్యానికి నోచుకోలేదని ఎటుచూసినా మురికి కాలువలు, పశు పేడ దిబ్బలు, వ్యర్థాలు దర్శనమిస్తున్నాయని ఆ ప్రాంతంలో నివాసం ఉంటున్న ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి అయితే చాలు ప్రతినిత్యం దోమలతో యుద్ధం చేయాల్సి వస్తుందని, వృద్ధులు పసిపిల్లలు బాలింతలకు తీవ్ర అనారోగ్యాల పరిస్థితులు ఏర్పడుతున్నాయి. నెలల్లో ఒకసారికూడా బ్లీచింగ్, రసాయన పిచికారి వంటివి చేసిన దాఖలాలు కానరావటం లేదు. అసలే ఫోర్త్ వేవ్ కరోనా మహమ్మారితో ఎదుర్కొనే పరిస్థితుల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు హెచ్చరిస్తూ గ్రామస్థాయి నుంచి పారిశుధ్యంపై దృష్టి సారించాలన్నారు. జిల్లా అధికారుల చొరవతో ముందుకు వెళ్లాలని ఆదేశాలు జారీ చేస్తే మండల, గ్రామస్థాయిలో ఉన్న అధికారుల నిర్లక్ష్యపు తీరుకు నిదర్శనమని, రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్రామాల్లో అందు బాటులో ఉండి ప్రజలతో మమేకమై పని చేయగలరని సచివాలయ సిబ్బందిని ఏర్పాటు చేస్తే రాష్ట్ర ప్రభుత్వానికి మచ్చ తెచ్చే విధానంలో సచివాలయ సిబ్బంది పనితీరుకి నిదర్శనం అన్నారు. ఆయా గ్రామాల సచివాలయ సిబ్బంది మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నా పట్టించుకోలేని పరిస్థితిలో ఉన్నారని వాపోయారు. ఇకనైనా మండల, జిల్లా స్థాయి అధికారులు స్పందించి తమ గ్రామాల్లో పారిశుధ్యంపై శ్రద్ధచూపాల్సిందిగా ఆయా సంబంధించిన పంచాయతీ ప్రజలు కోరుకుంటున్నారు.

ఏకలవ్య గురుకుల పాఠశాలను వెంటనే ప్రారంభించండి

సిపిఎం డిమాండ్



ప్రజాశక్తి- బిఎన్‌కండ్రిగ: మండలంలోని కనమనంబేడు పంచాయతీలో ఉన్న ఏకలవ్య గురుకుల పాఠశాలను వెంటనే ప్రారం భించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ ఈ పాఠశాలలో సుమారు 500 మంది పైగా బాలురు, బాలికలు ఇంటర్మీడియట్ వరకు చదువుకుంటున్నారు. అయితే ఈ పాఠశాల అద్దె భవనం కాబట్టి అమ్మాయిలు, అబ్బాయిలు ఒకేచోట చదువుకోవడం హాస్టల్ కూడా ఇద్దరికీ కలిపి ఉండడంతో విద్యార్థినిలు చాలా ఇబ్బంది పడుతున్నారని ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థినిలకు ఒకే భవనంలో ఉండడం వలన అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. అలాగే వ్యవసాయ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్.రమణయ్య మాట్లాడుతూ ఇంతమంది విద్యార్థిని విద్యార్థులు అటు పాఠశాల ఇటు వసతి గృహం ఉండడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. అంతే కాకుండా పాఠశాల అద్దె భవనానికి ఒక నెలకు రూ.54 వేలు అద్దె ఇవ్వడం ప్రభుత్వానికి సిగ్గుచేటు అన్నారు. ఇలా ప్రభుత్వ డబ్బులు వృధా చేయడం ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యమేనని ఆయన దుయ్యపట్టారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి అనేది ఉంటే పూర్తి అయిపోయిన ఏకలవ్య పాఠశాలలో తొందరగా ప్రారంభించాలని లేదంటే సిపిఎం ఆధ్వర్యంలో కొత్తగా నిర్మించిన ఏకలవ్య పాఠశాల ముద్దు ధర్నా కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. వెంటనే ప్రభుత్వ అధికారులు చొరవ తీసుకుని పూర్తయిన ఏకలవ్య పాఠశాలను ప్రారంభించి విద్యార్థిని విద్యార్థుల పరిస్థితులను అర్థం చేసుకుని పాఠశాలకు ప్రారంభించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయక కార్యదర్శి, బాల గురవయ్య, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి సుబ్బయ్య, రమణయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య వసతుల మెరుగుదలకు సహకరించాలి

డాక్టర్ ప్రేమ్ రెడ్డి ఫ్యామిలీ ఫౌండేషన్'

సహ వ్యవస్థాపకురాలు శ్రీసిటీ సందర్శన



ప్రజాశక్తి-వరదయ్యపాలెం: అమెరికా కాలిఫోర్నియా విక్టర్‌విల్లేలోని ప్రముఖ వైద్యురాలు, 'డాక్టర్ ప్రేమ్‌రెడ్డి ఫ్యామిలీ ఫౌండేషన్' సహ వ్యవస్థాపకురాలు డాక్టర్ శాంతి రెడ్డి బుధవారం శ్రీసిటీని సందర్శిం చారు. ఇతర వ్యాపారవేత్తల బృందంతో వచ్చిన ఆమెకు శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సాదర స్వాగతం పలికారు. శ్రీసిటీ ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, ప్రత్యేకతలు, పారిశ్రామిక అభివృద్ధి, అపార ఉద్యోగ అవకాశాల గురించి వివరించారు. శ్రీసిటీ ప్రాజెక్ట్ అమలు తీరుపట్ల హర్షం వ్యక్తం చేసిన డాక్టర్ శాంతి, శ్రీసిటీ బృందం కృషిని అభినందించారు. వెనుకబడిన ప్రాంతాన్ని మోడల్ ఇండస్ట్రియల్ పార్కుగా మార్చడంలో శ్రీసిటీ యాజమాన్య కృషిని అభినందిస్తూ, స్థాని కులకు ముఖ్యంగా మహిళలకు పుష్కలంగా ఉద్యోగాలు కల్పించడాన్ని ఆమె ప్రశం సించారు. ప్రపంచ స్థాయి పారిశ్రామిక నగరాన్ని నిర్వహించడం అంత తేలికైన పని కాదన్న ఆమె, దేశంలోనే అత్యంత అనుకూల పెట్టుబడి కేంద్రంగా శ్రీసిటీని అభివృద్ధి చేసినందుకు డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. శ్రీసిటీ పరిసర ప్రాంతంలో వైద్య వసతులు మరింత మెరుగుపరిచేందుకు సహకరించాలని శాంతిరెడ్డికి విజ్ఞప్తి చేశారు. అనంతరం వారు శ్రీసిటీ పరిసరాలతో పాటు, యం.ఎస్.ఆర్ గార్మెంట్స్ ఉత్పత్తి కేంద్రాన్ని సందర్శించారు. కాగా, డాక్టర్ శాంతి రెడ్డి హెల్త్‌కేర్ విజనరీ, ప్రైమ్ హెల్త్‌కేర్ ఛైర్మన్, అమెరికాలోని డాక్టర్ ప్రేమ్ రెడ్డి ఫ్యామిలీ ఫౌండేషన్ ప్రెసిడెంట్, సీఈవో డాక్టర్ ప్రేమ్ సాగర్ రెడ్డి భార్య, ఈ ఫౌండేషన్ ద్వారా ఆరోగ్య విద్య, కళాశాల స్కాలర్‌షిప్‌లు, పబ్లిక్ హెల్త్‌కేర్ ఎడ్యుకేషన్, ఉచిత కమ్యూనిటీ క్లినిక్‌లు నిర్వహించే స్వచ్ఛంద సంస్థలకు మిలియన్ల డాలర్లను విరాళంగా ఇచ్చారు. ఈ దంపతులు భారతదేశంలోని అనేక స్వచ్ఛంద సంస్థలకు కూడా పెద్ద ఎత్తున ఉదారంగా సాయం చేశారు.

మహిళా వర్శిటీలో నాక్ బృందం విస్తృత పర్యటన

- పూర్వ విద్యార్థులతో సంభాషణ
- వివిధ విభాగాల స్టాల్స్ పరిశీలన
- వర్శిటి ప్రాంగణంలో చెట్లు నాటిన బృందం



ప్రజాశక్తి - క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో రెండవ రోజు బుధవారం నాక్ బృందం విస్తృతంగా పర్యటించింది. సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ తమిళనాడు ఉపకులపతి ఆచార్య ముత్తు కలింగం కృష్ణన్ ఛైర్‌పర్సన్‌గా, ది మహారాజా సయాజి రావ్ యూనివర్సిటీ ఆఫ్ బరోడా అధ్యాపకులు ఆచార్య హర్ష వటాటియ మెంబర్ కో-ఆర్డినేటర్‌గా, పంజాబ్ యూనివర్సిటీ అధ్యాపకులు ఆచార్య మౌనిక చావ్లా, దేవి అహల్య విశ్వవిద్యాలయం అధ్యాపకులు ఆచార్య సుధీరా చండేల్, వనస్థలి విద్యాపీట్ డీన్ ఆచార్య సీమ వర్మ, బెనారస్ హిందూ యూనివర్సిటీ అధ్యాపకులు ఆచార్య ప్రియాంక గీత సభ్యులుగా ఉన్న నాక్ బృందం బుధవారం మహిళా విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీలు పొంది వివిధ సంస్థలలో పనిచేస్తున్న పూర్వ విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడటం జరిగింది. యూనివర్సిటీలో అనుభవాలు, యూనివర్సిటీ గురించి అభిప్రాయం అడిగి తెలుసుకున్నారు. హోమ్ సైన్స్, సెరికల్చర్, ఉమెన్ స్టడీస్ సెంటర్ వారు ఏర్పాటు చేసిన స్టాల్స్ ను సందర్శించారు. యూనివర్సిటీ హాస్టల్ లను పరిశీలించి అక్కడ ఉన్నటువంటి విద్యార్థినులను వసతి సౌకర్యాలను గురించి అడిగి తెలుసుకున్నారు. వర్సిటీలోని ఇంక్యుబేషన్స్, నూతన ఆవిష్కరణలు, ప్లేస్మెంట్ సెల్, ఐక్యూఏసి సెల్ ను సందర్శించారు. యూనివర్సిటీ ప్రాంగణంలో న్యాక్ బృందం చెట్లు నాటటం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపకులపతి ఆచార్య దువ్వూరు జమున, రిజిస్ట్రార్ ఆచార్య డి. ఎం. మమత, వివిధ విభాగాల డీన్లు, ఐక్యూఏసి సభ్యులు పాల్గొన్నారు.



అథ్లెటిక్స్‌లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పట్టణానికి చెందిన శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్(శ్రీరామ్ నగర్ కాలనీ) విద్యార్థులు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చాటారు. మంగళవారం జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ షార్ట్ పుట్, జావెలిన్ త్రో పోటీల్లో నిత్య హాసిని, అమరేష్ కుమార్ రాయ్ ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ప్రతిభ చాటిన విద్యార్థులను ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య, ఏజీఎం శ్రీనివాసులు, డీన్ సుబ్రమణ్యం, పీఈటీ మేఘన తదితరులు అభినందించారు.

ప్రశ్నిస్తే కొడతారేమో

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : 'రానురాను రాజుగారి గుర్రం గాడిద అయినట్లు' రాష్ట్ర సీఎం జగన్ తన అసమర్థతను కప్పి పుచ్చుకోవడానికి, ప్రజా వ్యతిరేక నిర్ణయాలను ప్రశ్నించే వారిని ఇప్పుడు తిట్టమని, తరువాత దశలో కొట్టమని కలెక్టర్లను ప్రోత్సహించినా ఆశ్చర్యం లేదని తెలుగు నాడు విద్యార్థి సమాఖ్య మాజీ రాష్ట్ర కార్యదర్శి, బిసి వెల్ఫేర్ జెఎసి రాష్ట్ర కార్యదర్శి డా.యం. ఉమేష్ రావు ఎద్దేవా చేశారు. రాష్ట్ర చరిత్రలోనే మొట్టమొదటిసారిగా అభాగ్యులకు అండగా ఉండాలన్న సంకల్పంతో 'సామాజిక భద్రతా పింఛను' పథకాన్ని టీడీపీ ప్రవేశపెట్టిందన్నారు. అయితే జగన్ ప్రభుత్వం అవ్వా, తాతలకు అండగా ఉంటానని మాటిచ్చి నిలువునా మోసగిస్తోందని మండిపడ్డారు.

సప్తగిరి బ్యాంకు సేవలు హర్షణీయం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి బ్రాంచ్ సప్తగిరి గ్రామీణ బ్యాంకు సేవలు హర్షణీయమని జనరల్ మేనేజర్ రవికుమార్ అన్నారు. స్థానిక బ్యాంకు ఆధ్వర్యంలో బుధవారం మెగా రుణ వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఖాతాదారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ బ్యాంకు నందు ఇస్తున్న వివిధ రుణ పథకాల గురించి వివరిస్తూ దేశంలోనే గ్రామీణ బ్యాంకులు అత్యుత్తమ స్థానంలో ఉందన్నారు. ఈ కార్యక్రమానికి శ్రీకాళహస్తి బ్రాంచ్ మేనేజర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రాహు-కేతు పూజల్లో కొడాలినాని



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో నిర్వహించే రాహు-కేతు సర్పదోష నివారణ పూజల్లో బుధవారం మాజీ మంత్రి, గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నానీ కుటుంబ సభ్యులతో కలసి పాల్గొన్నారు. మొదట శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బియ్యపు మధుసూదనరెడ్డి కుమారుడు బియ్యపు ఆకర్ష్ రెడ్డి దక్షిణగోపురం వద్ద సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. కొడాలి నాని కుటుంబ సభ్యులతో కలసి ప్రత్యేక రాహు-కేతు సర్పదోష నివారణ పూజలు చేసుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. దర్శనానంతరం గురుదక్షిణా మూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ అధికారులు పాల్గొన్నారు.

పేదల సమస్యలు పట్టవు

ప్రజాశక్తి -బాలాయపల్లి : అధికార ప్రభుత్వానికి పేదల సమస్యలు పట్టవని మాజీ టిడిపి అధ్యక్షుడు రాయి మస్తాన్ నాయుడు, ప్రధాన కార్యదర్శి శ్రీహరి అన్నారు. బుధవారం మండలంలోని నాయుడు చెరువు కండ్రిగ గ్రామంలో తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలు మేరకు, వెంకటగిరి నియోజకవర్గం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సూచనలు మేరకు" ఇదేం ఖర్మ...మన రాష్ట్రానికి "అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల టిడిపి పార్టీ మాజీ అధ్యక్షులు రాయి మస్తాన్ నాయుడు, కొర్రపాటి రామచంద్ర నాయుడు, మండల టిడిపి పార్టీ ప్రధాన కార్యదర్శి కూను శ్రీహరి, బూతు కన్వీనర్ మద్దూరు కృష్ణ తదితరులు పాల్గొన్నారు .

ఆన్‌లైన్ విద్య ఎంతో ఉపయోగం

ప్రజాశక్తి -బాలాయపల్లి : ఆన్‌లైన్ విద్య ఎంతో ఉపయోగమని విద్యా కమిటీ ఛైర్మన్ షేక్ గౌస్ భాషా పేర్కొన్నారు. బుధవారం మండలంలోని జయంపు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతికంగా ఎదగాలని, అప్పుడే పోటీ ప్రపంచాన్ని ఎదుర్కోగలరని, దీనిని దృష్టిలో ఉంచుకొని సీఎం జగన్మోహన్ రెడ్డి నాడు-నేడు కింద స్కూళ్లను అభివృద్ధి చేశారని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో 35 మంది విద్యార్థులకు 7 మంది ఉపాధ్యాయులకు కలిపి మొత్తం 42 ట్యాబులను పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు మస్తా నమ్మ, ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు, పాఠశాల తల్లిదండ్రుల, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మద్యం తాగి మామ పై దాడి

- భయాందోళనలో గ్రామస్తులు

రంగ ప్రవేశం చేసిన పోలీసులు



ప్రజాశక్తి -బాలాయపల్లి : పూటుగా మద్యం తాగి కూతురినిచ్చిన మామపై దాడి చేసి గాయపరిచిన సంఘటన తిరుపతి జిల్లా గూడూరు రూరల్ మండలం పుట్టమరాజు వారి కండ్రిగ గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామస్తులు కథనం మేరకు.. గత 15 ఏళ్ళ క్రితం శ్రీపొట్టి శ్రీరాములు జిల్లా సైదాపురం మండలం గిద్దలూరు గ్రామానికి చెందిన ఈదల శ్రీనివాసులకు గూడూరు రూరల్ మండలం పుట్టమరాజు వారి కండ్రిగ గ్రామానికి చెందిన బొల్లిగిరిల శ్రీనివాసులు కుమార్తె బంగారమ్మతో వివాహం జరిగింది. గత కొంతకాలంగా పూటుగా మద్యం తాగి భార్య బంగారమ్మను నిత్యం అనుమానంతో కొడుతూ ఉండేవాడు. దీంతో ఆమె పుట్టింటికి గత ఏడు వచ్చేసింది. మద్యం తాగి పరుషపదజాలంతో చరవాణిలో మాట్లాడేవాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. మద్యం తాగి సాయంత్రం మూడు గంటలకు ఎవరు లేని సమయంలో వచ్చి కర్రతో భార్యను కొడుతుండడంతో అమ్మాయి తండ్రి ఎందుకు కొడుతున్నావని అడిగినందుకు తిరిగి మామపై కర్రతో దాడి చేశాడు. గ్రామస్తులు భయభ్రాంతులకు గురయ్యారు.

దేవస్థాన భూములను కాపాడాలి

ప్రజాశక్తి-కోట : కోటమ్మ తల్లి దేవస్థానం భూములను కాపాడాలని నాయకులు పనబాక కోటేశ్వరరావు తహశీల్దార్ పద్మావతికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బుధవారం కోట మండలంలోని స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద పలువురు నాయకులు తహశీల్దార్‌ని మర్యాదపూర్వకంగా కలిసి సర్వే నంబర్ 13 0 3 లో కోటమ్మ తల్లి దేవస్థానానికి సంబంధించిన 1.66 సెంట్లు పట్టా భూమి ఉందని తెలిపారు. అప్పట్లో కోనేరు ఉండేదని, కోటమ్మతల్లి దేవస్థాన ఉత్సవాలు జరిగేటప్పుడు ఆ కోనేరులో తెప్ప ఉత్సవం నిర్వహించేవారు. అంతేకాకుండా పలు గ్రామాలనుండి వచ్చే పశువులకు దాహార్తిని తీర్చే విధంగా ఉండేదని గుర్తు చేశారు. అలాంటి కోటమ్మ తల్లి దేవస్థానం భూములను అధికార పార్టీ నాయకులు సచివాలయ భవనాల కట్టడాలను ఆక్రమించుకుని ఉన్నారన్నారు. దేవాలయ భూముల్లో ఎలాంటి ప్రభుత్వ కట్టడాలను కట్టకూడదని హైకోర్టు నుంచి ఉత్తర్వులు ఉన్నాయన్నారు. దేవాలయ భూముల్లో కట్టిన అక్రమ కట్టడాలను తొలగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి పనబాక కోటేశ్వరరావు, మండల అధ్యక్షులు సారంగం రమేష్ బాబు ఉన్నారు.

గడపగడపకు ఎమ్మెల్యే కిలివేటి



ప్రజాశక్తి - ఓజిలి: పేదరికాన్ని అధిగమించేలా పేదలకు సంక్షేమ పథకాలు అమలును తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో నిర్వహిస్తుందని సూళ్లూరు పేట శాసన సభ్యులు కిలివేటి సంజీవయ్య పేర్కొన్నారు. ఓజిలి మండలంలోని ఆర్మేనిపాడు గ్రామంలో సూళ్ళూరుపేట నియోజకవర్గ పరిశీలకులు సుధీర్ రెడ్డి, సర్పంచ్ సుకుమార్ రాజు, జెడ్పిటిసి సభ్యులు గుంటమడుగు రవీంద్ర రాజు, ఎంపీపీ గడ్డం అరుణారెడ్డి, ఎంపిటిసి సభ్యులు రఘురాం రాజు ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. తహశీల్దార్ డి.లాజరస్, ఎంపీడీవో రజనీకాంత్ , సీఐ వైవి.సోమయ్య, ఎస్‌ఐ.ఆదిలక్ష్మి , కో ఆప్షన్ సభ్యులు ఖాదర్ బాషా, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దేశిరెడ్డి మధుసూదన్ రెడ్డి, వైసిపి సీనియర్ నాయకులు ఉచ్చూరు హరినాథ్ రెడ్డి, పాదర్తి హరినాథ్ రెడ్డి, ముమ్మిడి సుబ్బారావు, గురవరాజు, సుబ్బరాజు, ఫణేంద్ర కుమార్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, వివిధ శాఖ అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వరికి పొట్ట దశలో పొటాష్ చాలా అవసరం

ప్రజాశక్తి-రేణిగుంట: వరిపైరు పొట్ట దశలో ఉన్నపుడు పొటాష్ వాడకం మంచి ఫలితాలనిస్తుందని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ఏడీఏ భాస్కరయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రేణిగుంట మండలం, కె.గొల్లపల్లి గ్రామంలో రైతుల శిక్షణలో ఆయన మాట్లాడుతూ వరిపొట్ట దశలో ఉన్నపుడు ఎకరాకు 15-20 కిలోల పొటాష్ వాడకం వలన గింజ నాణ్యత పెరిగి అధిక దిగుబడి వస్తుందని తెలిపారు. వారికి అవసరానికి మించి యూరియా వాడితే తెగులు, తెల్ల చీడ ఎక్కువగా వస్తుందన్నారు. రైతుల స్థాయిలో లభించే సేంద్రియ ఎరువులు మార్కెట్లో దొరికే ఎరువులు కంటే చౌకగాను, లాభదాయకంగా ఉంటుందన్నారు. వ్యవసాయ అధికారి వేణుగోపాలరావు వరిలో చేపట్టవలసిన చీడ నివారణ, నీటి యాజమాన్యం గురించి వివరించారు. కార్యక్రమం తర్వాత రైతులతో కలసి పొలాలను సందర్శించి వరిలోని సమస్యలకు సూచనలిచ్చారు. కార్యక్రమంలో గ్రామ రైతులతో పాటు ఆదర్శ రైతు రమేష్, గ్రామ ఉద్యాన సహాయకులు తరుణ్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జయశంకర్ పాల్గొన్నారు.

టిటిడి ఉద్యోగుల సౌకర్యాలను కొనసాగించాలి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉద్యోగుల పట్ల యాజమాన్యం వైఖరి సమర్థనీయం కాదని టిటిడి ఉద్యోగ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటి ఓ ప్రకటనలో ఖండించింది. వైకుంఠ ద్వార దర్శనం కల్పిస్తున్న రోజులలో ఉద్యోగులు, కుటుంబ సభ్యులకు వైకుంఠ ఏకాదశి రోజున దర్శనం అవకాశం ఇవ్వకపోగా గతంలో వున్న సౌకర్యాలను తొలగించి రేషన్ పద్ధతుల్లో రోజుకి రెండు వేల మందిని పంపుతామని సర్క్యులర్ ఇవ్వడం సమంజసం కాదన్నారు.

వైకుంఠ ఏకాదశి, ద్వాదశి మాత్రమే నిర్వహించే రోజుల్లో ఉద్యోగులకు మహాద్వారం నుండి దర్శనం సౌకర్యం వుండేది, అలాగే కుటుంబ సభ్యులకు వైకుంఠం క్యూ కాంప్లెక్స్ ద్వారా సర్వదర్శనం సమయంలో నిత్యం పంపించే వారు. ఆ సౌకర్యం తొలగించి ఉద్యోగి రెఫరల్ పై రెండు సార్లు10 మందికి అవకాశం వుండేది. కావున గతంలో వున్న సౌకర్యాలను యధాతథంగా కొనసాగిస్తూ సర్క్యులర్లో మార్పులు చేసి ఇవ్వవలసినదిగా టీటీడీ ఉద్యోగ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ కంపల వెంకటరమణారెడ్డి, జి.వెంకటేశం, ఎం.నాగార్జున, ఎస్.కల్పన, కే.ఇందిరా, ఎం.ప్రసాద్ రావు, జె. భాస్కర్, గుణశేఖర్, రత్నప్రభాకర్, వి.వెంకటర మణ, రెడ్డప్ప, కృష్ణ మూర్తి తదితరులు డిమాండ్ చేశారు.

'చారిత్రాత్మక పార్టీ కాంగ్రెస్'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: దేశం, ప్రజల కోసమే పుట్టిన ఏకైక చారిత్రాత్మక పార్టీ కాంగ్రెస్ అని ఆ పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ బత్తెయ్యనాయుడు అన్నారు. స్థానిక పీపుల్స్ నర్సింగ్ హోమ్‌లో బుధవారం కాంగ్రెస్ పార్టీ 138వ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బత్తెయ్య నాయుడు మాట్లాడుతూ 1885లో కాంగ్రెస్ పార్టీ పురుడు పోసుకుందున్నారు. ఎంతో మంది మహామహులు కాంగ్రెస్ పార్టీ నుంచి దేశానికి సేవలందించారని గుర్తు చేశారు. కాంగ్రెస్‌ను తిరిగి అధికారంలోకి రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర 2800 కిలోమీటర్లు చేరుకున్న సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. జానీ బాషా, శేఖర్, ఈర్ల గోపి, నాగూరయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే చెవిరెడ్డికి సజ్జల రామకృష్ణారెడ్డి పరామర్శ

- ధైర్యంగా ఉండాలని పలువురు నేతల ఓదార్పు
- నేడు తుమ్మలగుంటలో చెవిరెడ్డి సుబ్రమణ్యం రెడ్డి కర్మక్రియలు

ప్రజాశక్తి - క్యాంపస్ : చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణా రెడ్డి పరామర్శించారు. బుధవారం తుమ్మల గుంటలోని ఎమ్మెల్యే చెవిరెడ్డి ఇంటికి చేరుకున్న సజ్జల రామకృష్ణారెడ్డి దంపతులు ముందుగా చెవిరెడ్డి తండ్రి సుబ్రమణ్యం రెడ్డి చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులు అందరినీ ప్రేమగా పలుకరించి ధైర్యం చెప్పారు. అంతకు ముందు మాజీ ఎమ్మెల్సీ జయచంద్ర నాయుడు, టీడీపీ సీనియర్ నేత ఇందుశేఖర్, ప్రముఖ నిర్మాత ఎన్వీ ప్రసాద్‌లు ఎమ్మెల్యే చెవిరెడ్డిని కలసి ఓదార్చారు.

నేడు తుమ్మలగుంటలో చెవిరెడ్డి మణిరెడ్డి కర్మక్రియలు

ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తండ్రి చెవిరెడ్డి సుబ్రమణ్యం రెడ్డి (మణిరెడ్డి) ఈనెల 19వ తేదీన మరణించారు. దశ దిన కర్మక్రియలు ఈ నెల 29వ తేదీ గురువారం జరుగనున్నట్లు ఎమ్మెల్యే చెవిరెడ్డి కుటుంబ సభ్యులు తెలిపారు. మణిరెడ్డి కర్మక్రియలకు జనం అధికంగా వచ్చే అవకాశం ఉన్నందున అందుకు తగిన ఏర్పాట్లును సిద్ధం చేశారు. తుమ్మలగుంట గ్రామంలోని తన ఇంటి వద్ద జరిగే కర్మక్రియల ఏర్పాట్లును ఎమ్మెల్యే చెవిరెడ్డి దగ్గరుండి పర్యవేక్షణ చేశారు.



చిన్ననాటి స్నేహితునికి ఎమ్మెల్యే చెవిరెడ్డి పరామర్శ

చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తన తండ్రి మరణించిన బాధలో ఉన్నప్పటికీ తన చిన్ననాటి స్నేహితుడు దుఃఖంలో ఉన్నట్లు తెలిసిన వెంటనే ఆ కుటుంబ సభ్యులను కలసి ధైర్యం చెప్పారు. తిరుపతి నగరం అమరావతి నగర్‌లో నివాసం ఉంటున్న మల్లు ప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిలు, చిన్ననాటి స్నేహితులు ప్రసాద్ రెడ్డి, తండ్రి వెంకట సుబ్బారెడ్డి (83) సోమవారం మృతి చెందాడు. ఆ విషయం కొంత ఆలస్యంగా తెలుసుకున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి బుధవారం ఆ ఇంటికి చేరుకుని తన స్నేహితుడు ప్రసాద్ రెడ్డితో పాటు కుటుంబ సభ్యులు అందరికీ ఏ కష్టం వచ్చినా నేనున్నాను అంటూ ధైర్యం చెప్పి ఓదార్చారు. తన బాధను కడపులో దాచి పెట్టుకుని స్నేహితునికి ధైర్యం చెప్పేందుకు వచ్చిన చెవిరెడ్డి గొప్పతనానికి ఆ కుటుంబీకులు రెండు చేతులతో వినమ్రంగా నమస్కరించారు.

రాబోయే ఎన్నికల్లో కన్వీనర్లదే కీలక పాత్ర

ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

ప్రజాశక్తి- పిచ్చాటూరు : వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో సచివాలయం కన్వీనర్లదే కీలక పాత్ర అని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. మండల కేంద్రమైన పిచ్చాటూరు ఎంపిడివో కార్యాలయం ఆవరణంలో వాలంటీర్లు సచివాలయం కన్వీనర్లతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్న ప్రభుత్వంలో వాలంటీర్లు అందిస్తున్న సేవలను కొనియాడారు. సంక్షేమ పథకాలకు అర్హులైన ప్రతి ఒక్కరికీ వాలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే పంపిణీ చేస్తున్న అనర్హత ఉన్న వారికి సంక్షేమ పథకాలు అందకపోతే ప్రతి పక్ష నాయకులు రాద్ధాంతం చేయడంపై ఎమ్మెల్యే మండిపడ్డారు. ఎంపిపి రేఖా, జెడ్పిటిసి విష్ణుప్రియ, వైసీపీ మండల కన్వీనర్ కెటి హరిచంద్ర రెడ్డి, వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కె.వి.భాస్కర్ నాయుడు, ఎంపిటిసి రమేష్ రాజు, చెంగల్రాయల్ రెడ్డి, బాబు రెడ్డి, సుబ్రమణ్యం రెడ్డి, గోవిందన్ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి గజేంద్ర, పాల పద్మనాభం, తోప్పయ్య, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



పేద ప్రజల అభ్యున్నతి ప్రభుత్వం ధ్యేయం

పేద ప్రజల అభ్యున్నతి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. పిచ్చాటూరు మండలం బంగాళా పంచాయతీలో మలాగుంట బంగాళా హరిజనవాడ ఇంద్ర పేట గిరిజన కాలనీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. గడపగడపకు వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు కరపత్రం అందించి ఒక్కొక్క కుటుంబానికి ఎంత లబ్ధి చేకూరింది వివరించారు.. ఈకార్యక్రమంలో తహశీల్దార్ మధుసూదన్ ఎంపిడివో శ్రీనివాసులు ఎంపీపీ రేఖా జడ్పిటిసి విష్ణుప్రియ వైకాపా మండల కన్వీనర్ కెటి హరిచంద్ర రెడ్డి వైకాపా రాష్ట్ర కార్యదర్శి కె.వి.భాస్కర్ నాయుడు ఎంపిటిసి రమేష్ రాజు అయ్యప్ప వైకాపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.